సాక్షి అనంతపురం

ఆదివారం । 7 । ఏప్రిల్ । 2024

I



చీనీ టన్ను రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.31 వేలు పలికాయి.



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6. సరాసరి రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

ఆదివారం	సోమవారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 4.55



న్యూస్‌రీల్

భానుడి భగభగ

- శింగనమల, తాడిపత్రిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



అనంతపురం అగ్రికల్చర్: భానుడి భగభగలు మరింత ఉగ్రరూపం దాల్చాయి. ఎన్నడూ లేని విధంగా ఏప్రిల్ మొదట్లోనే సూరీడు తీవ్రస్థాయిలో ప్రభావం చూపిస్తున్నాడు. గరిష్ట ఉష్ణోగ్రతలు, ఉక్కపోత, వడగాల్పులతో 'అనంత' నిప్పులకొలిమిలా తయారైంది. శనివారం కూడా శింగనమల మండలం తరిమెల, తాడిపత్రి మండలం తేరన్నపల్లిలో ఏకంగా 44.4 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం విశేషం . విడపనకల్లు 44.2 డిగ్రీలు, గుంతకల్లు 43.8, పుట్లూరు 43.7, పెద్దవడుగూరు 43.6, యల్లనూరు 43.5, ఆత్మకూరు 43.1, బొమ్మనహాళ్ 43 డిగ్రీలు నమోదు కాగా మిగతా ప్రాంతాల్లో 40 నుంచి 43 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. జిల్లా కేంద్రం అనంతపురంలో 42.5 డిగ్రీలు రికార్డయింది. కనిష్ట ఉష్ణోగ్రతల విషయానికి వస్తే కుందుర్పిలో 22.1 డిగ్రీలు ఉండగా మిగతా ప్రాంతాల్లో 23 నుంచి 27 డిగ్రీల మధ్య ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఇక శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లిలో 43.8 డిగ్రీలు గరిష్టం నమోదు కాగా కదిరి 43.5 డిగ్రీలు, ధర్మవరం 43.3, పుట్టపర్తి, ముదిగుబ్బ 43, బత్తలపల్లి, రొద్దం, తలుపుల 42.9 డిగ్రీలు ఉండగా మిగతా ప్రాంతాల్లో గరిష్టంగా 39 నుంచి 42 డిగ్రీలు, కనిష్టం 19 నుంచి 26 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. రికార్డుస్థాయిలో నమోదవుతున్న ఎండలతో జనం బెంబేలెత్తిపోతున్నారు.


12 నుంచి ఈవీఎంల ర్యాండమైజేషన్



గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను తనిఖీ చేసి వస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్, కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం అర్బన్: ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈ నెల 12 నుంచి 14 వరకు మూడు రోజుల పాటు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలో గల గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. ఈవీఎంల ర్యాండమైజేషన్ కోసం చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్ వద్ద పటిష్ట బందోబస్తు ఉండాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగాలన్నారు. ఈవీఎంల ర్యాండమైజేసన్ ప్రక్రియ నిర్వహణకు పకడ్బందీ భద్రత ఏర్పాట్లు ఉండాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ ర్యాండమైజేషన్ పక్కాగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఎన్నికల డీటీ దివాకర్ రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నిర్భయంగా వినియోగించుకోండి




ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఎస్పీ అమిత్ బర్దర్

అనంతపురం: స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తామని, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్పీ అమిత్ బర్దర్ పిలుపునిచ్చారు. గొడవలు, అల్లర్లు లేని హింసారహిత ఎన్నికలే తమ లక్ష్యమన్నారు. బుక్కరాయసముద్రం మండలం సిద్దరాంపురంలో కేంద్ర సాయుధ బలగాలచే కవాతు నిర్వహించారు. ఫ్లాగ్‌మార్చ్‌లో జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల్లో భరోసా కల్పించారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లకుండా ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ బీవీ శివారెడ్డి, బీఎస్ఎఫ్ డీఎస్పీ ధర్మేంద్ర, బుక్కరాయసముద్రం సీఐ వెంకటేశులు, తహసీల్దార్ హనుమాన్‌నాయక్ పాల్గొన్నారు.

నిన్ను నమ్మం బాబూ!

హామీలిచ్చి.. అందర్నీ ముంచి..

- 2014లో ఒక్క హామీనీ నిలబెట్టుకోలేని చంద్రబాబు
- చిత్తు కాగితాలుగా మారిన రుణ హామీ పత్రాలు
- డ్వాక్రా రుణాలు మాఫీ కాక డిఫాల్టర్లుగా మారిన వైనం
- ఇంటికొకటి కాదు ఊరికొక్క ఉద్యోగమూ ఇవ్వని దుస్థితి
- తాజాగా సూపర్ సిక్స్ పథకాలంటూ టీడీపీ కరపత్రాలు
- ఆ కరపత్రాలను చెత్తబుట్టలో వేస్తున్న ప్రజలు
- ఉమ్మడి అనంతపురం జిల్లాలో బాబు హామీలంటే భయపడుతున్న జనం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: అధికారం కోసం అలవికాని హామీలు ఇవ్వడం.. అమలు చేయకుండా ప్రజలను దగా చేయడం చంద్రబాబు నైజం. ఆయన గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలే ఇందుకు నిదర్శనం. ఆయన మాటలు నమ్మి కంతులు చెల్లించని డ్వాక్రా మహిళలు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా ముద్ర పడ్డారు. రుణ మాఫీ అవుతుందని, బ్యాంకుల్లోని బంగారు ఆభరణాలు ఇంటికి వస్తాయని ఆశించిన రైతులకు భంగపాటే ఎదురైంది. గడువు ముగిసినా రుణాలు చెల్లించలేదంటూ బ్యాంకర్ల నుంచి నోటీసులు అందడంతో అవమానభారంతో కుంగిపోయారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు వందలాది హామీలు అమలు కాలేదు. ఇప్పుడు ఎన్నికల మేనిఫెస్టోలో కనీవినీ ఎరుగని రీతిలో 99 శాతం హామీలు అమలు చేసి ప్రజల్లో ఆదరణ, విశ్వాసం చూరగొన్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి. కూటమి తరఫున టీడీపీ ఇస్తున్న హామీలను ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎవ్వరూ నమ్మడం లేదు. హామీల కరపత్రాలను చెత్తబుట్టల్లోకి పడేస్తుండటంతో టీడీపీ అభ్యర్థుల్లో కలవరం మొదలైంది.

10 లక్షల మందికి పైగా రైతులకు మోసం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పూర్తిగా రుణమాఫీ చేస్తానని, బ్యాంకుల్లోని మీ బంగారం విడిపిస్తానని, ఒక్కపైసా కూడా కట్టొద్దని నాడు చంద్రబాబు చెప్పారు. దీనికోసం 2015–16లో రుణ హామీ పత్రాలు ఇచ్చారు. కానీ 2019 దాకా ఒక్క పైసా కట్టక పోవడంతో రైతులందరూ బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా మారారు. అందరికీ నోటీసులొచ్చాయి. దీంతో ఆస్తులు తాకట్టుపెట్టి రుణాలు కట్టారు.

డ్వాక్రా మహిళలకు కోలుకోలేని దెబ్బ

అనంతపురం జిల్లాలో డ్వాక్రా మహిళలకు చంద్రబాబు హయాంలో కోలుకోలేని దెబ్బపడింది. డ్వాక్రా రుణాలు మొత్తం మాఫీ చేస్తానని హామీ ఇవ్వడంతో 2014లో బాబుకు ఓట్లేశారు. బాబు మాటలు నమ్మి కంతులు చెల్లించకపోవడం, రుణాలు మాఫీ కాకపోవడంతో చాలామంది మహిళలకు బ్యాంకుల నుంచి నోటీసులు వచ్చాయి. 2019 చివరిలో పసుపు– కుంకుమ కోసం అంటూ ఎన్నికల తాయిలంగా రూ.10 వేలు వేశారు. చంద్రబాబు పుణ్యమా అని ఏ గ్రేడులో ఉన్న పొదుపు సంఘాలు డీ గ్రేడ్‌కు పడిపోయాయి. బ్యాంకర్ల దృష్టిలో డ్వాక్రా సంఘాలకు ఇచ్చిన రుణాలు నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) జాబితాలో చేరాయి.

ఇంటికొక ఉద్యోగం పెద్ద మాయ

అనంతపురం జిల్లాలో 2019కి ముందు ఉపాధి కోసం భారీగా వలసలుండేవి. 2014లో ఇంటికో ఉద్యోగం ఇస్తానని బాబు హామీ ఇచ్చారు. కానీ ఊరికొక ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారు. జాబు రావాలంటే బాబు రావాలని చెప్పారు. ఎన్నికల్లో గెలిచాక ఆ హామీనే విస్మరించారు. కాపులకు రిజర్వేషన్ అని అదీ మర్చిపోయారు. ముస్లింలకు ప్రధాన నగరాల్లో హజ్‌హౌస్‌ల నిర్మాణం చేపడతామని, రూ.5 లక్షల వడ్డీలేని రుణాలు ఇస్తామని, ఆదాయం లేని మసీదులలో ఇమామ్, మౌజన్లకు రూ.5 వేలు ఇస్తామని చెప్పి ఏ ఒక్కటీ ఇవ్వలేదు. ఇక దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేరుస్తామని, ప్రతి జిల్లాలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు నిర్మిస్తామని చెప్పి మిన్నకుండిపోయారరు.

'సూపర్ సిక్స్'తో సరికొత్త మోసం

టీడీపీ అధినేత చంద్రబాబు 'సూపర్ సిక్స్' పథకాలంటూ మళ్లీ ఎన్నికల హామీలు ఇస్తున్నప్పటికీ ఎక్కడా స్పందన కనిపించడం లేదు. పింఛన్ ఏప్రిల్ నుంచే పెంచి ఇస్తామన్నా జనం నమ్మడం లేదు. ఓ వైపు వలంటీర్ల ద్వారా ఇంటిదగ్గరకే వచ్చి ఇస్తున్న పింఛన్ల పంపిణీని అడ్డుకున్న బాబు కుట్రలపై ఉమ్మడి అనంతపురం జిల్లాలో పింఛన్‌దారులు మండిపడుతున్నారు. తెలుగుదేశం అభ్యర్థులు సూపర్ సిక్స్ పథకాలతో పట్టణాలు, పల్లెల్లో ప్రచారం చేస్తున్నా.. ఆ కరపత్రాలను ప్రజలు వెంటనే చెత్తబుట్టలోకి వేస్తున్నారు.

ఆయన హామీలు నీటిమీద రాతలే



టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నీటిమీద రాతల్లా నిలిచిపోయాయి. రైతు రుణమాఫీ అన్నాడు. గెలిచాక దగా చేశాడు. డ్వాక్రా రుణాలన్నీ బేషరతుగా మాఫీ చేస్తానన్నాడు. అక్క,చెల్లెమ్మలను బ్యాంకుల్లో డిఫాల్టర్‌గా నిలబెట్టాడు. బీటీపీకి నీరిచ్చాకే 2019 ఎన్నికల్లో ప్రచారం చేస్తామన్నారు. దాన్ని తుంగలో తొక్కాడు. ఇలా వందలాది హామీలిచ్చాడు. సక్రమంగా ఆరు కూడా నెరవేర్చలేక పోయాడు. తాజా ఎన్నికల్లోనూ ఆయన ఇచ్చే హామీలను నమ్మడానికి రైతులు, సామాన్యులు ఎవరూ సిద్ధంగా లేరు.

– శ్రీరాములు, రైతు, పూలకుంట, గుమ్మఘట్ట మండలం

నిరుద్యోగులను నట్టేట ముంచాడు



చంద్రబాబు 2014 ఎన్నికల సమయంలో ఇంటికొక ఉద్యోగం ఇస్తానన్నాడు. ఉద్యోగం రాకుంటే నిరుద్యోగ భృతి చెల్లిస్తామన్నాడు. అధికారంలోకి వచ్చాక హామీని తుంగలో తొక్కి నిరుద్యోగులను నట్టేట ముంచాడు. ఇప్పుడు కొత్త ఎన్నికల మేనిఫెస్టోతో జనం ముందుకు వస్తున్నాడు. ఆయన్ను యువత ఎవ్వరూ నమ్మే పరిస్థితి లేదు.

– నరసింహులు, శెట్టూరు

రోడ్డు వేస్తామని విస్మరించారు



బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని దేవరకొండపైకి సిమెంట్ రోడ్డు వేస్తామని చంద్రబాబునాయుడు గత ఎన్నికల్లో ఇక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చాక హామీ కథే మరచిపోయారు. ఓట్ల కోసమే మాకు హామీ ఇచ్చారని అర్థమైంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి దేవర కొండపైకి రూ.4 కోట్లతో సిమెంట్ రోడ్డు వేయించారు.

– పూల రంగనాథ్, బీకేఎస్

హామీలన్నీ ఉత్తివే..



2014 ఎన్నికల్లో 650 హామీలతో మేనిఫెస్టో తయారు చేసి ఇంటింటికీ పంపించారు. ప్రత్యేక హోదాతో పాటు మహిళల రక్షణకు ఫోర్స్, ప్రతి నగరంలో హైటెక్ సిటీ ఏర్పాటు, రైతులకు, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ, ఆడబిడ్డ పుడితే 'మహాలక్ష్మి' పథకం కింద రూ. 25 వేలు బ్యాంకులో డిపాజిట్, ఇంటికొక ఉద్యోగం ఇస్తామని హామీల్లో పేర్కొన్నారు. ఇందులో ఏ ఒక్క హామీ నెరవేరలేదు. చంద్రబాబు హామీలన్నీ ఉత్తివే అని తేలిపోయింది.

– కొసినేపల్లి నరసింహారెడ్డి, తాడిపత్రి

టీడీపీ నీటి రాజకీయం

- అనుకూల సిబ్బందితో అరాచకం
- శ్రీరామిరెడ్డి నీటి సరఫరాకు ఆటంకం
- నీటి ఉధృతికి కాలిపోయిన మోటార్లు



పంప్‌హౌస్‌లో నీటితో మునిగిన మోటార్లు

కళ్యాణదుర్గం: ప్రజల్లో ఆదరణ లేని తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవడం కోసం అడ్డదారులు తొక్కుతోంది. ఇందులో భాగంగా నీటి రాజకీయానికి తెరలేపింది. తమకు అనుకూలురైన సిబ్బందిని ఉసిగొలిపి శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పంపుహౌస్‌లో మోటార్ల ధ్వంసానికి పాల్పడింది. కళ్యాణదుర్గంలోని శ్రీరామిరెడ్డి పథకం తాగునీటి సరఫరా పంప్ హౌస్‌లో శుక్రవారం రాత్రి టీడీపీ నాయకుల ప్రోద్బలంతో నలుగురు సిబ్బంది ఉద్దేశపూర్వకంగా పైపుల వాల్వులు ఆన్ చేశారు. దీంతో నీరంతా పంపుహౌస్ కింద ఉన్న మోటార్లలోకి చేరింది. మోటార్లన్నీ కాలిపోయాయి. నీటి ఉధృతికి పైపులు ధ్వంసమయ్యాయి. దాదాపు రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లింది. శనివారం సాయంత్రం పంపుహౌస్‌ను ఈఈ జవహర్‌కుమార్, డీఈ శ్రీనివాసులు, జేఈ లావణ్య, కాంట్రాక్టర్ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఫేజ్–1కు సంబంధించిన మూడు మోటార్లు కాలిపోయినందున కళ్యాణదుర్గంతో పాటు హిందూపురం, మడకశిర నియోజకవర్గాలకు నీటిసరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు చర్యలు చేపడతామని తెలిపారు. ఇదిలా ఉండగా పంప్‌హౌస్‌లో జరిగిన ఘటనపై పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రజల్లో వ్యతిరేకత తేవాలని కుట్ర

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్యకు నియోజకవర్గంలో ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా పాటుపడుతున్నారు. అయితే శ్రీరామిరెడ్డి నీటి పథకం మోటార్లు పనిచేయకుండా.. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు కలిగించి.. ఆ నెపాన్ని వైఎస్సార్‌సీపీకి ఆపాదించాలని టీడీపీ నేతలు కుట్రలు పన్నినట్టు తెలుస్తోంది. ఉగాది పండుగ వేళ నీటి సరఫరాకు ఇబ్బంది కలిగిస్తే... టీడీపీ అభ్యర్థి సురేంద్రబాబు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసి ప్రజలకు దగ్గరవ్వాలనే ఎత్తుగడతోనే ఇలా చేస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వారి ఓటు పోస్టల్ బ్యాలెట్‌లో

- పోలింగ్ విధుల్లో 14 వేలమంది
- 3,500 మంది పోలీసు సిబ్బంది
- 85 ఏళ్లు పైబడిన వృద్ధులు 9,719 మంది
- దివ్యాంగులు 26,107 మంది
- అత్యవసర సేవలందించే 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం



హోమ్ ఓటింగ్‌లో భాగంగా ఇంటి వద్దనే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధులు (ఫైల్)

అనంతపుర అర్బన్: ఎన్నికల విధుల్లో, అత్యవసర సేవల్లో ఉండే ఉద్యోగులు తమ ఓటును పోలింగ్ కేంద్రంలో వ్యక్తిగతంగా కాకుండా పోస్టల్ బ్యాలెట్ ద్వారా వేయనున్నారు. ఇక వయసు 85 ఏళ్ల దాటిన వారికి, దివ్యాంగులు, మంచానికి పరిమితమై నడవలేని వారికి హోమ్ ఓటింగ్‌కు ఎన్నికల కమిషన్ వీలు కల్పించింది. వీరంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. జిల్లావ్యాప్తంగా పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది, పోలీసులు దాదాపు 18,852 మంది ఉన్నారు. వృద్ధులు, దివ్యాంగులు హోమ్ ఓటింగ్ ద్వారా ఇంటి వద్దనే పోస్టల్ బ్యాలెట్ విధానంలో తమ ఓటు వేయనున్నారు. ఇక అత్యవసర సేవలు అందించే 33 శాఖల ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది.

ఫారం–12డీ సమర్పించాలి

ఎన్నికల విధులు నిర్వర్తించే ఉద్యోగులు, అధికారులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుపై విచారణ నిర్వహించి సంబంధిత ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అనుమతిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం పోలింగ్‌కు రెండు రోజుల ముందు ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేస్తారు. అదే విధంగా పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలోనూ పోస్టల్ బ్యాలెట్ కౌంటర్లు ఏర్పాటు చేస్తారు.

హోమ్ ఓటింగ్ కోసం సర్వే

వయసు 85 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులు, మంచానికి పరిమితమై నడవలేని వారికి హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు వేసే వీలును ఎన్నికల కమిషన్ కల్పించింది. జిల్లావ్యాప్తంగా వయసు 85 ఏళ్ల పైబడిన ఓటర్లు 9,719 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 3,830 మంది, మహిళలు 5,889 మంది ఉన్నారు. ఇక దివ్యాంగులు 26,107 మంది ఉన్నారు. వీరిలో హోమ్ ఓటింగ్‌కు ఎందరు అర్హులు అనేది గుర్తించేందుకు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. అర్హులైన వారికి ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేయిస్తారు. అనంతరం ప్రత్యేకంగా ఒక ఎన్నికల బృందం ఓటరు ఇంటికి వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేలా చూస్తారు.

అత్యవసర సేవలందించే సిబ్బందికి..

అత్యవసర సేవలందించే శాఖలకు చెందిన సిబ్బంది కూడా తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. మొత్తం 33 శాఖలను అత్యవసర సేవలందించే జాబితాకి నోటిఫై చేసింది. పోలింగ్ రోజున ఉద్యోగరీత్యా విధుల్లో ఉండే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. వీరి జాబితాను సేకరించే ప్రక్రియను అధికారులు చేపట్టారు.

పోస్టల్ బ్యాలెట్ వినియోగ వివరాలు	
ప్రిసైడింగ్ అధికారులు (పీఓ)	2,552
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీఓ)	2,715
అదర్ పోలింగ్ అధికారులు (ఓపీఓ)	9,000
బందోబస్తులో పాల్గొనే పోలీసులు	3,500
ఎన్నికల నిర్వహణ కమిటీల సిబ్బంది	570
నోడల్ అధికారులు	33
సెక్టార్ అధికారులు	241
సెక్టార్ పోలీసు అధికారులు	241
హోమ్ ఓటింగ్..	
85 ఏళ్లు పైబడిన వారు	9,719
దివ్యాంగులు	26,107

నోటిఫై శాఖలు ఇవే..

మెట్రో, రైల్వే రవాణా (ప్రయాణికులు, సరుకు) సేవలు, పోలింగ్ రోజు కార్యకలాపాలు కవర్ చేయడానికి కమిషన్ ఆమోదంతో అధికారిక లేఖలు జారీ అయిన మీడియా వ్యక్తులు, విద్యుత్ శాఖ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్ అండ్ టెలిగ్రామ్, దూరదర్శన్, ఆకాశవాణి, రాష్ట్ర మిల్క్ యూనియన్- మిల్క్ కో–ఆపరేటివ్ సొసైటీలు, ఆరోగ్య శాఖ, ఫుడ్ కార్పొరేషన్, విమానయాన, రోడ్డు రవాణా సంస్థ, అగ్నిమాపక, ట్రాఫిక్ పోలీసు, అంబులెన్స్ సేవలు, షిప్పింగ్, ఫైర్ ఫోర్స్, జైలు, ఎక్సైజ్, వాటర్ అథారిటీ, ఖజానా, అటవీ, సమాచార–పౌర సంబంధాల శాఖ, ఎనర్జీ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, పీడబ్ల్యూడీ శాఖ, నేషన్ ఇన్ఫర్మేటిక్ సెంటర్, విపత్తు నిర్వహణ శాఖలను అత్యవసర సేవలందించే జాబితాలో గుర్తించారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం



సీఈఓ వీసీలో పాల్గొన్న కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ అమిత్ బర్దర్, జెడ్పీ సీఈఓ నిదియాదేవి, కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ రామకృష్ణారెడ్డి తదితరులు

- క్లిష్టమైన పోలింగ్ కేంద్రాలు 1,032 గుర్తింపు
- ఎన్నికల నియమావళి పకడ్బందీగా అమలు
- సీఈఓకు వివరించిన కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: జిల్లాలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు సన్నద్ధంగా ఉన్నామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముకేష్‌కుమార్ మీనాకు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఎన్నికల సన్నద్ధతపై సీఈఓ శనివారం విజయవాడ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, ఎస్పీ అమిత్ బర్దర్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, ఈఆర్ఓలు పాల్గొన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు చేపట్టిన చర్యల గురించి సీఈఓకు కలెక్టర్ వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. ఎంసీసీ ఉల్లంఘనకు సంబంధించి ఇప్పటి వరకు 52 మంది వలంటీర్లు, 15 మంది కాంట్రాక్టు కార్మికులు, ఇద్దరు డీలర్లు, ఇద్దరు ఎండీయూ వాహన నిర్వాహకులు, ఇద్దరు శాశ్వత ఉద్యోగులను సస్పెండ్ చేశామన్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేశాన్నారు. సి–విజిల్ ద్వారా 315 ఫిర్యాదులు రాగా నిర్ణీత వ్యవధిలో పరిష్కరించి నివేదికలు అందించామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,213 పోలింగ్ కేంద్రాలు, 23 అదనపు పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అందులో 1,032 కేంద్రాలను క్లిష్టమైనవి (క్రిటికల్)గా గుర్తించామని, వీటిలో వెబ్ కాస్టింగ్‌కు చర్యలు చేపట్టామని వివరించారు.

రూ.1.93 కోట్ల నగదు సీజ్

అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో డైనమిక్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని సీఈఓకు ఎస్పీ అమిత్ బర్దర్ చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న నగదు, మద్యం సీజ్ చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.1.93 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు పటిష్ట బందోబస్తు చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో ఆర్ఓలు జి.వెంకటేష్, రాణీసుస్మిత, వి.శ్రీనివాసులురెడ్డి, వసంతబాబు, రాంభూపాల్‌రెడ్డి, వెన్నెల శ్రీను, నోడల్ అధికారులు ప్రభాకర్‌రావు, సురేంద్ర, వీర్రాజు, శ్రీనివాసనాయక్, ఉమామహేశ్వరమ్మ, భాస్కర్, గురుస్వామిశెట్టి, ఎస్‌బీసీ డీఐఓ రవిశంకర్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ఓబుళరెడ్డి, పౌర సరఫరాల సంస్థ డీఎం రమేష్‌రెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, తహసీల్దార్ శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం ముద్దలాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాలగుండ్ల శంకరనారాయణ, వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రచార హోరు

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ప్రభుత్వం ద్వారా కల్గిన సంక్షేమ లబ్ధి, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. ప్రజల నుంచి కూడా విశేష స్పందన లభిస్తోంది. దీంతో అభ్యర్థులతో పాటు పార్టీ శ్రేణుల్లో జోష్ కన్పిస్తోంది. పారదర్శక పాలన, ముంగిటకే ప్రభుత్వ సేవలు, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల కొనసాగింపునకు మళ్లీ జగనన్నను సీఎం చేసుకుంటామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. - సాక్షి నెట్‌వర్క్



శింగనమల నియోజకవర్గంలోని బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో భారీ జన సందోహం మధ్య ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులు

క్లుప్తంగా

టీడీపీ ప్రచారంలో రేషన్ డీలర్



బెళుగుప్ప తండాలో టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేషన్ డీలర్ జయాబాయి

బెళుగుప్ప: మండల పరిధిలోని బెళుగుప్ప తండాలో తెలుగుదేశం పార్టీ తరుపున ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విజయసింహ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. అయితే ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తూ బెళుగుప్ప తండాలోని ఐదో నంబర్ చౌకధాన్యపు దుకాణం డీలర్ జయాబాయి తన భర్త చంద్రానాయక్‌తో కలసి టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. డీలర్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల అధికారులకు విన్నవించారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారిణి భ్రమరాంబదేవి

బుక్కరాయసముద్రం: వడదెబ్బ తగలకుండా ప్రజలందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో వివరాలను అడిగి తెలుసుకున్నారు. వడదెబ్బ నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎవరూ బయటకు రాకపోవడం మంచిదన్నారు. అత్యవసరం అయితే తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొలాల్లో పనులు చేసుకునే వారు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వడదెబ్బ ఏవిధంగా వస్తుంది? ఏ విధంగా నివారించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, సీహెచ్ఓ మోహన్‌బాబు, శ్రీనివాసులు, శ్యామల, కరుణాకర్, రాజేంద్రప్రసాద్, రామలక్ష్మి , హారిక, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులందరూ స్టార్ క్యాంపెయినర్లే

- ఉమ్మడి 'అనంత' జిల్లాలో అన్నిస్థానాలు వైఎస్సార్‌సీపీవే..
- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను పొందిన లబ్ధిదారులందరూ జగనన్నకు స్టార్ క్యాంపెయినర్లేనని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం అనంతపురం నగర శివారులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వం ఒక్క ఉద్యోగమైనా ఇచ్చిందా అని చంద్రబాబు ప్రశ్నించారన్నారు. అయితే తాజాగా ఆయన నోటి ద్వారానే జగన్ 1.60 లక్షల మందికి సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారు. వారితో పింఛన్లు ఇప్పించమనండి అని చెప్పడం చూస్తుంటే ఇది జగనన్న నమ్మిన దేవుడి స్క్రిప్ట్ అన్నారు. వలంటీర్లు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులను స్టార్ క్యాంపెయినర్లుగా మార్చింది చంద్రబాబే అన్నారు. మొత్తం మీద జగనన్నకు అతి పెద్ద క్యాంపెయినర్ చంద్రబాబేనని పేర్కొన్నారు. పింఛన్లు తీసుకునేందుకు సచివాలయాలకు వెళ్లిన వారిలో రాష్ట్ర వ్యాప్తంగా 46 మందికి పైగా వడదెబ్బకు మృతి చెందారన్నారు. వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు ఇవ్వకూడదంటూ చంద్రబాబు బినామీ నిమ్మగడ్డ రమేష్‌కు చెందిన సంస్థ ఇచ్చిన ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ ఆ నిర్ణయం తీసుకుందన్నారు.

చంద్రబాబు సెల్ఫ్‌గోల్

బీజేపీతో జత కట్టడమే చంద్రబాబు పతనానికి కారణమవబోతోందని ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు సెల్ఫ్‌గోల్ చేసుకున్నాడన్నారు. పవన్‌కళ్యాణ్ తీరు ఉదయం జనసేన, మధ్యాహ్నం బీజేపీ, సాయంత్రం టీడీపీ, రాత్రి మరోపార్టీలా మారిందని విమర్శించారు. జగనన్న పాదయాత్రలో ఎండనక, గాలనక వేల కిలోమీటర్లు నడిచారన్నారు. అయితే పవన్‌కళ్యాణ్ కొన్ని గంటల పాటు తిరగకుండానే వడదెబ్బ అంటూ ఆస్పత్రి పాలై చికిత్స పొందుతున్నాడన్నారు. ఆయనా జగన్ గురించి, పోరాటాల గురించి మాట్లాడేదని ఎద్దేవా చేశారు. బీజేపీ చూస్తే టీడీపీ నుంచి వలస వచ్చిన వారికే ఎక్కువ టికెట్లు ఇచ్చిందన్నారు. కనీసం ఒక సీటైనా గెలుస్తామా? లేదా? అనేలా బీజేపీ పరిస్థితి మారిందన్నారు. రాష్ట్రంలో 60 సీట్లను చంద్రబాబు అమ్ముకున్నాడని ఆరోపించారు. రూ. 3 వేల కోట్లకు పైగా వసూళ్లు చేసుకున్నాడన్నారు. చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడిగా ఘోరంగా విఫలమయ్యాడని ధ్వజమెత్తారు. ఆయనకు జెండా లేదు అజెండా లేదన్నారు. వైఎస్ జగన్ చేపట్టిన సిద్ధం సభలతో రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ శ్రేణుల్లో వణుకు పుట్టిందన్నారు. ఆ తర్వాత చంద్రబాబు చర్యలు, క్రియల వల్ల తెలుగుదేశం పార్టీకి తీరని నష్టం తెచ్చేలా ఉన్నాయన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఎన్నికల్లో ఉమ్మడి అనంత జిల్లాలో రెండు ఎంపీ, 14 ఎమ్మెల్యే సీట్లు గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: కష్టపడి చదివి తమకు కుమారుడు ఆసరాగా ఉంటాడనుకున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. విధి చిన్న చూపు చూడటంతో వారి బిడ్డ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. వివరాల్లోకి వెళితే .. ఆత్మకూరు మండలం ముట్టాల గ్రామానికి చెందిన కేశవరెడ్డి, వరాలు అనే దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి (19) అనంతపురంలో ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల ఇంటర్ పరీక్షలు ముగించుకొని సెలవులపై ఇంటికి వచ్చాడు. మూడు రోజుల్లో ఉగాది పండుగ ఉండటంతో శనివారం ఇల్లు కడిగేందుకు సిద్ధమయ్యారు. తల్లిదండ్రులకు విష్ణువర్ధన్‌రెడ్డి కూడా సాయం చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ నేపథ్యంలోనే విద్యుత్ మోటర్ ఆన్ చేసే సమయంలో విష్ణువర్ధన్‌రెడ్డి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తల్లిదండ్రులు వెంటనే అతన్ని ఆత్మకూరుకు ఆస్పత్రి తీసుకెళ్లారు. వైద్యులు చికిత్స అందించి వెంటనే అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికెళ్లేందుకు సిద్ధమవుతుండగా అంతలోనే పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు నిర్జీవంగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

విష్ణువర్ధన్‌రెడ్డి విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ముట్టాలకు చేరుకొని విష్ణువర్ధన్‌రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

రూడ్‌సెట్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో గ్రామీణ నిరుద్యోగ మహిళలకు ఉచితంగా టైలరింగ్, బ్యూటీ పార్లర్ శిక్షణ కల్పిస్తున్నట్లు డైరెక్టర్ ఎస్. విజయలక్ష్మి తెలిపారు. ఈ నెల 20 నుంచి 30 రోజుల పాటు శిక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి కల్పిస్తామని తెలిపారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన వారై 19 నుంచి 45 సంవత్సరాల్లో వయస్సు ఉన్న మహిళా నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను సెల్ నంబర్ 9618876060, 9440905479 లను సంప్రదించి నమోదు చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్త సస్పెన్షన్

తాడిపత్రి అర్బన్: యాడికి మండలం రాయలచెరువు 7వ కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యకర్త అనసూయ సస్పెండ్ అయ్యారు. ఎన్నికల ప్రవర్తనా నియామావళిని ఉల్లంఘించి గత మంగళవారం టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్ ప్రచారంలో పాల్గొన్నందుకు అంగన్‌వాడీ కార్యకర్త అనసూయపై వేటు పడింది. తన కాలనీలోని ఓట్లన్నీ టీడీపీకి వేయిస్తానన్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీదేవి తాడిపత్రిలోని ఐసీడీఎస్ కార్యాలయానికి చేరుకుని అంగన్‌వాడీ కార్యకర్త అనూసయను విచారించి నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, నియోజకవర్గ ఎన్నికల అధికారులకు పంపించారు. దీంతో ఎన్నికల అధికారులు శనివారం అంగన్‌వాడీ కార్యకర్త అనసూయను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారని సీడీపీఓ షాజిదాబేగం తెలిపారు.

ఇద్దరి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన ఇద్దరిని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శనివారం సస్పెండ్ చేశారు. గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామ వలంటీరు పి.రమేష్, యాడికి మండలం రాయలచెరువు-7 అంగన్‌వాడీ వర్కర్ పి.అనసూయ సస్పెన్షన్‌కు గురయ్యారు. ఇదిలా ఉండగా... ఎఫ్ఎస్, ఎస్ఎస్ టీముల ద్వారా ఇప్పటి వరకు రూ.2,05,00,563 నగదు సీజ్ చేశారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఇప్పటి వరకు రూ.45,87,336 విలువ చేసే 11,726.09 లీటర్లు మద్యం సీజ్ చేశారు.

అభివృద్ధికి అడ్డుపుల్ల జేసీ

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

తాడిపత్రి రూరల్: మునిసిపాలిటీలో అభివృద్ధి జరగకుండా చైర్మన్ పదవిని అడ్డు పెట్టుకుని జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుపుల్లలా మారాడని ఎమ్మెల్యే పెద్దారెడ్డి విమర్శించారు. పట్టణంలోని సీపీఐ కాలనీలో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. వివిధ పథకాల కింద వచ్చిన నిధులతో వేసిన టెండర్లలో ఎక్కువ శాతం వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు దక్కించుకున్నారన్న కడుపు మంటతో అగ్రిమెంట్లు కాకుండా అడ్డుకుంటున్నారన్నారు. టెండర్లు పూర్తయి పనులను పరిశీలించిన తర్వాత కౌన్సిల్ తీర్మానాలకు సంబంధించిన మినిట్స్‌లో సంతకాలు పెడతానని జాప్యం చేస్తూ వస్తున్నారని చెప్పారు. మునిసిపాలిటీలో అభివృద్ధి పనులు జరగాలంటే వాటి పరిశీలనకు సంవత్సరాల సమయం తీసుకుంటారా అని ప్రశ్నించారు. జేసీకి తాడిపత్రి మునిసిపాలిటీని అభివృద్ధి చేయడం ఇష్టం లేదన్నారు. సమస్యలతో సతమతమవుతూ ప్రజలు ఎప్పుడూ తన ఇంటి వద్దకు వచ్చి పడిగాపులు పడాలన్నదే జేసీ ఆలోచనగా ఉందని పేర్కొన్నారు. అమృత్ పథకం కింద నిధులు తీసుకొచ్చి రూ.200కే ఇంటింటికీ కొళాయి వేయాలనుకుంటే అందుకు కూడా జేసీ అడ్డుపడ్డారని గుర్తు చేశారు. జేసీ చెప్పే మాటలకు... చేసే చేతలకు సంబంధం ఉండదన్నారు. మునిసిపల్ ఎన్నికల సమయంలో నాటకాలు ఆడి ప్రజలను మోసం చేసి చైర్మన్ పదవి పొంది.. ఇప్పుడేమో అభివృద్ధికి అడ్డుపడుతున్నారని ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ఏడాది తర్వాత ఒక కులానికి సంబంధించిన వ్యక్తిని చైర్మన్ చేస్తానని హామీ ఇచ్చారని, మూడేళ్లు దాటుతున్నా చైర్మన్ పదవిలో తానే తిష్ట వేసుకొని కూర్చున్నాడని చెప్పారు. సంతలో పశువులను కొన్నట్టుగా నాయకులను లక్షలు పోసి కొంటున్నా టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డిలో మానసిక అశాంతి ఎక్కువవుతోందన్నారు. ఆయన ప్రచారం నిర్వహిస్తున్నా ఓటర్లలో సానుభూతి కనిపించడం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో నాయకులకు ఉన్న పాత అప్పులు కట్టి పార్టీలో జేసీ చేర్పించుకుంటున్నారని తెలిపారు. ప్రచారంలో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు వైఎస్సార్‌సీపీకే మద్దతు తెలియజేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన సంక్షేమాభివృద్ధికి జనం జై కొడుతున్నారని పేర్కొన్నారు. ఆయన రుణం తీర్చుకోవడానికి సమయం వచ్చిందని, ఎన్నికల్లో ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీని గెలిపిస్తామని చెబుతున్నారని పేర్కొన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో రైతులు, కార్మికులు, కూలీలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర ప్రభంజనంలా సాగుతోందని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలవడం ఖాయమని, మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించడం పక్కా అని ఎమ్మెల్యే పెద్దారెడ్డి తెలియజేశారు.

నిధి యాప్ అప్‌డేట్ జరుగుతోంది



ఉపాధ్యాయ సంఘాల నాయకులతో మాట్లాడుతున్న ఏపీజీఎల్ఐసీ సూపరింటెండెంట్

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఏపీజీఎల్ఐసీ) 'నిధి యాప్'ను రాష్ట్రస్థాయిలో అప్‌డేట్ చేస్తున్నారని అధికారులు తెలిపారు. శనివారం ఏపీజీఎల్ఐసీ కార్యాలయంలో ఎస్టీయూ, ఆపస్, ఎస్ఏపీడీ, పీఈటీ అసోసియేషన్ల నాయకులు సూపరింటెండెంట్ పుష్పావతమ్మను కలిశారు. నిధి యాప్, మిస్సింగ్ క్రెడిట్స్, లోన్లు, బాండ్స్ తదితర విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా పుష్పావతమ్మ మాట్లాడుతూ నిధి యాప్ అప్‌డేట్ చేస్తున్నారన్నారు. ఈ యాప్‌లో లాగిన్ ఆయి బాండ్స్, మిస్సింగ్ క్రెడిట్స్ చూసుకోవచ్చన్నారు. దీనివల్ల ఎలాంటి అభద్రతా భావానికి లోను కావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ నిధి యాప్ వల్ల భవిష్యత్‌లో సబ్‌స్క్రిప్షన్ మొత్తాలు మిస్సింగ్ కాకుండా వారి అకౌంట్లలోజమ అవుతాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రుణాలు, ఫైనల్ పేమెంట్‌లకు గతవారంలో రూ. 700 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో జిల్లాలో 2023 జూన్ వరకు దరఖాస్తు చేసుకున్న వారి అకౌంట్లలో డబ్బులు జమ అయ్యాయన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్. రమణారెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికలను రాప్తాడు నియోజకవర్గంలో ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్ కుమార్ ఆదేశించారు. శనివారం సాయంత్రం రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై ఆర్ఓ, ఎస్టీపీఓ, ఏఈఆర్ఓలు, ఎంపీడీలు, ఎన్నికల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని రాప్తాడు, అనంతపురం రూరల్, కనగానపల్లి, రామగిరి, ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లి మండలాల పరిధిలో ఎన్నికలు సజావులా నిర్వహించేలా ఆర్ఓ, ఎస్టీపీఓలు బాధ్యత తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్ఓ వసంత బాబు, తహసీల్దార్లు సీతారాం, సుబ్రమణ్యం, పరమేశ్వరప్ప, రమాదేవి, రమణి, హామీద్ బాష, ఎస్టీపీఓలు, ఎంపీడీఓలు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

అనంతపురం అర్బన్: ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాప్తాడు నియోజకవర్గానికి సంబంధించి అనంతపురంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, ఈవీఎం, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను కలెక్టర్ శనివారం రాత్రి పరిశీలించారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి ఈవీఎం కమీషనింగ్ వేరువేరుగా గదులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఓ వసంతబాబు, తహసీల్దారు శాంతారామ్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఆధునిక ఉపకరణాలు



మాట్లాడుతున్న సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా దివ్యాంగ పిల్లలందరికీ వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించి వారి అవసరాలకు తగిన అధునాతన ఉపకరణాలను సమగ్ర శిక్ష ద్వారా అందిస్తామని సమగ్రశిక్ష ఏపీసీ వరప్రసాదరావు తెలిపారు. శనివారం నగరంలోని కొత్తూరు ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన వికలత్వ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ గుత్తి, తాడిపత్రి, కళ్యాణదుర్గం, రాయదుర్గంలో ఇప్పటికే ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. అన్నిచోట్లా మంచి స్పందన లభించిందన్నారు. ఆయా శిబిరాల్లో నిర్వహించిన నిర్ధారణ పరీక్షల వివరాలను క్రోడీకరించి రాష్ట్ర కార్యాలయానికి పంపుతామన్నారు. గతేడాది జూన్‌లో 220 మంది ప్రత్యేక అవసరాల పిల్లలకు అధునాతన ఉపకరణాలు, అవసరమైన వారికి ట్యాబ్‌లు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ ఏడీ అబ్దుల్ రసూల్, ఆర్‌బీఎస్‌కే పీఓ నారాయణస్వామి, బాలుర పాఠశాల హెచ్ఎం రవీంద్రబాబు, సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ షమ, సీఎంఓ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరితోట దగ్ధం



పెనకచెర్లడ్యాంలో కాలిపోయిన కొబ్బరి చెట్లు

గార్లదిన్నె: మండల పరిధిలోని పెనకచెర్లడ్యాంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కొబ్బరి తోట దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. పెనకచెర్లడ్యాంలో 1.5 ఎకరా పొలంలో కొబ్బరి చెట్లు సాగు చేస్తున్నట్లు రైతు ఎర్రిస్వామి తెలిపారు. పొలంలో 11 కేవీ విద్యుత్ వైర్లు ఉండడంతో వాటిని మర్చాలని పలుమార్లు విద్యుత్ అధికారులకు విన్నవించుకున్న ఫలితం లేదన్నారు. విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాదం జరిగి కొబ్బరి తోటకు మంటలు వ్యాపించడంతో దాదాపు 60 చెట్లు కాలిపోయాయన్నారు. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారని చెప్పారు. కొబ్బరి కాయలు, డ్రిప్పు వైర్లు, పైపులు అన్ని మంటల్లో కాలిపోయాయన్నారు. దీంతో దాదాపు రూ.6 లక్షలు నష్టం జరిగిందన్నారు.

రూ.3 లక్షల నగదు సీజ్

అనంతపురం: ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2 లక్షల నగదును అనంతపురం టౌటౌన్ పోలీసులు సీజ్ చేశారు. శనివారం నాయక్‌నగర్ రైల్వే గేటు సమీపంలో డీఎస్పీ జి. వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో టూటౌన్ సీఐ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ రుష్యేంద్రబాబు, సిబ్బంది వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అనంతపురానికి చెందిన సురేష్‌కుమార్‌రెడ్డి ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.2 లక్షల నగదును తీసుకెళ్తుండడంతో పోలీసులు నగదును సీజ్ చేశారు. ఆ మొత్తాన్ని అనంతపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.

- నగరంలోని మాంఛూ సర్కిల్ సమీపంలో వాహనాల తనిఖీలో రూ.లక్ష నగదును సీజ్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ వి.రెడ్డప్ప తెలిపారు. నగదును అనంతపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ మృతిపై పోలీసుల విచారణ

గుత్తి: పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నివాసముండే రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ సుంకన్న (77) శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సుంకన్న మృతిపై సీఐ వెంకటరామిరెడ్డి విచారణ చేపట్టారు. శనివారం ఈ విషయంపై స్థానికులను విచారించారు. సుంకన్న ఎప్పుడు ఇంటిలోకి వెళ్లాడు? తదితర విషయాలపై లోతుగా దర్యాప్తు చేపట్టారు.

భర్త తాగుడుకు బానిసయ్యాడని భార్య ఆత్మహత్య



ఉషారాణి (ఫైల్)

యాడికి: భర్త తాగుడుకు బానిసయ్యాడన్న మనస్తాపంతో భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తూట్రాళ్లపల్లెలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి తండ్రి గోపాల్‌గౌడ్ వివరాల మేరకు... నంద్యాల జిల్లా డోన్ మండలం గుమ్మకుంటకు చెందిన ఈడిగ గోపాల్‌గౌడ్‌కు ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆరేళ్ల క్రితం గోపాల్ గౌడ్ చిన్న కూతురు ఉషారాణి (26)ని యాడికి మండలం తూట్రాళ్లపల్లెకి చెందిన అంపగౌని శ్రీదేవి కుమారుడు గోపీనాథ్‌గౌడ్‌కు ఇచ్చి వివాహం చేశారు. గోపీనాథ్ మండల పరిధిలోని వేములపాడు వద్ద ఉన్న సోలార్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గోపీనాథ్‌గౌడ్, ఉషారాణి దంపతులకు హర్షవర్ధిని (5), వేదశ్విని (3) కుమార్తెలున్నారు. అయితే కొంత కాలంగా గోపీనాథ్‌గౌడ్ తాగుడుకు బానిసై పనికి వెళ్లకుండా తిరుగుతున్నాడు. దీంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. శుక్రవారం రాత్రి కూడా వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. మనస్తాపానికి గురైన ఉషారాణి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. ఎంత పిలిచినా పలకక పోవడంతో కుటుంబ సభ్యులు ఆమెను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉషారాణి మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. మృతురాలి తండ్రి గోపాల్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



కంబదూరు బార్డర్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ అమిత్ బర్దార్

కంబదూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బార్డర్ చెక్‌పోస్టుల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అప్రమత్తంగా విధులను నిర్వహించాలని. విధులను నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్యలు తప్పవని ఎస్పీ అమిత్ బర్దార్ హెచ్చరించారు. శనివారం కంబదూరు సరిహద్దు చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. కర్ణాటక నుంచి మద్యం, నగదు, డ్రగ్స్ వంటివి రవాణా కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు. ఎప్పటికప్పుడు సీసీ కెమెరాలు సక్రమంగా పని చేసేలా చూసుకోవాలని సూచించారు. అనంతరం పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ బి.శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఎస్ఐ ఆంజనేయులు ఉన్నారు.

క్లుప్తంగా

24 మంది వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓ గీతావాణికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

రాప్తాడు: మండలంలోని రాప్తాడు, బోమ్మేపర్తి, మరూరు గ్రామా సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 24 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. బందెల ముత్యాలప్ప హరిప్రసాద్, స్నేహలత, రోజ, మీనా, వెంకట లక్ష్మీ, పార్వతి, కల్పనా, మాధవి, అఖిల, ప్రతిమ తదితరులు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ బాధ్యతగా అందేలా చూస్తున్నామన్నారు. సేవాభావంతో ఉద్యోగంలో చేరామన్నారు. టీడీపీ ప్రోద్బలంతో నిమ్మగడ్డ రమేష్ వలంటీర్లను ప్రజా సేవ చేయకుండా అడ్డుకున్నందుకు నిరసనగా రాజీనామా చేస్తున్నామన్నారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవడానికి ఇక నుంచి జగనన్న సైనికులుగా మారుతామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 93 మంది వలంటీర్లు రాజీనామా చేశారు.

'చంద్రబాబు క్షమాపణ చెప్పాలి'

అనంతపురం టవర్‌క్లాక్: ఆర్యవైశ్యులను కించపరిచేలా మాట్లాడిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వెంటనే క్షమాపణ చెప్పాలని మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సత్రసాల మంజునాథ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. రావులపాలెం సభలో ఆర్యవైశ్యులు కిరాణా షాపుల్లో గంజాయి అమ్ముతారని వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆర్యవైశ్యులు సేవ చేసుకుంటూ పది మందికి సహాయం అందిస్తారన్నారు. అటువంటి వారిపై నిందలు వేయడం సమంజసం కాదన్నారు.ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడిన చంద్రబాబు క్షమాపణ చెపాలన్నారు.

రాగే పరుశురాంకు సన్మానం



డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్ రాగే పరుశురాంను అభినందిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాల డిప్యూటీ రీజనల్ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన రాగే పరుశురాంను కురుబ సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం నగరంలోని రాగే పరుశురాం నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో కురుబ సంఘం, వైఎస్సార్ సీపీ నాయకులు బిల్లే మంజునాథ్, గోసల లక్ష్మన్న, తోపుదుర్తి శీనయ్య, పావురాల జగదీష్, బండి శేఖర్, బండి రమేష్, వైఎస్సార్ సీపీ కన్వీనర్లు నజీర్, తలారి వెంకటరాముడు పాల్గొన్నారు.

తరావీతో జన్మజన్మల పుణ్యఫలం



మహమ్మదీయా మసీదులో ప్రార్థనలు

అనంతపురం కల్చరల్: రంజాన్‌లో అత్యంత విశిష్టమైన లైలతుల్ ఖద్ర్ (సతామి) రాకతో అనంతలో భక్తిభావం వెల్లివిరిసింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలోని చాందినీ, మసీద్ ఏ మహ్మదీయ, జామియా, గపూర్ కాలనీలోని మజిద్ ఏ –మహ్మదీయ తదితర మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. రాత్రంతా జాగరణ చేస్తూ పవిత్ర గ్రంథంలోని సూరాలను ఆలకించారు. డాక్టర్ అబ్దుల్ రజాక్ గపూర్, మౌలానా మహ్మద్ సద్దాం హుస్సేన్ తదితరులతో పాటూ వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన మత పెద్దలు మాట్లాడుతూ ఖురాన్ అవతరించిన రాత్రి కూడా ఇదే కావడంతో సతామికి ప్రత్యేకస్థానం ఉందన్నారు. సహీహ్ బుకారీ గ్రంథంలోని ఉల్లేఖనాలను వివరించారు. ఈద్గా మసీదులో జరిగిన ప్రార్థనల్లో నగర మేయర్ వసీంతో పాటూ పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రసాద్.. నీ పప్పులుడకవు

- డబ్బుతో ప్రజల్ని కొనలేవు
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌కు ఎమ్మెల్యే అనంత కౌంటర్
- 25వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



పథకాల కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: దగ్గుపాటి ప్రసాద్.. ఇక్కడ నీ పప్పులుడకవు. డబ్బుతో చంద్రబాబు నాయుడు, లోకేష్‌ను కొనగలవే.. కానీ ప్రజల్ని కొనలేవని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ పతనం ఖాయమైందని టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ చేసిన వ్యాఖ్యలను అనంత ఖండించారు. శనివారం నగరంలోని 25వ డివిజన్‌లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమాన్ని చేపట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి కరపత్రాలను స్థానిక ప్రజలకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. దగ్గుపాటి ప్రసాద్.. నీకు డబ్బుందని అనుకుంటున్నావు. మీ పార్టీ వాళ్లే నీపై ఏం ఆరోపణలు చేస్తున్నారో గమనించాలని హితవు పలికారు. డబ్బు పెట్టి టికెట్ కొనుక్కున్నావంటూ మీ పార్టీ కార్యకర్తలు బహిరంగంగా చెబుతున్నారు. ప్రజాస్వామ్య దేశంలో నీకన్నా ధనవంతులను ప్రజలు చూశారని తెలిపారు. ఎవరి పాలనలో మంచి జరిగిందో ప్రజలకు తెలుసని గుర్తు చేశారు. మంచి, చెడును గుర్తించే తెలివితేటలు ఓటర్లకు ఉన్నాయన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో పెద్ద ఎత్తున సంక్షేమం

సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని జోస్యం చెప్పారు. నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధికి ప్రజలే సాక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో ప్రజలు ఏ విధంగా ఇబ్బంది పడ్డారో అందరికీ తెలుసన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పాలన అందించినట్లు పేర్కొన్నారు. ఖరీదైన విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సీఎంగా వైఎస్ జగన్‌రెండో సారి ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థ నాయక్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్ర రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, కార్పొరేటర్లు కమల్ భూషణ్, ఇసాక్, అనిల్‌కుమార్ రెడ్డి, సాకే చంద్రశేఖ, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎగ్గుల శ్రీనివాసులు, కొర్రపాడు హుస్సేన్ పీరా, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, శ్రీదేవి, సైపుల్లాబేగ్, కృష్ణవేణి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, నాగార్జున రెడ్డి, మన్నల సత్యనారాయణ, రాజేశ్వరి, జానీ, రామయ్య, తనీష, జావెద్, వనారస బలరాం, హనుమంతు, భారతి, దేశాయ్ భారతి రెడ్డి, ఉష వెంకటరామిరెడ్డి, అశోక్‌రెడ్డి, మనోజ్‌కుమార్, శివారెడ్డి, లింగాల రమేష్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ

నగరంలోని 32వ డివిజన్ పరిధిలోని విద్యుత్ నగర్‌లో ఆదివారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ నగర్ సర్కిల్ నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్



అనంతపురం కార్పొరేషన్: అనంతపురం నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 25వ డివిజన్ హౌసింగ్ బోర్డులో జరిగిన ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి అనంత వెంకటరామిరెడ్డిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొత్త బిచ్చగాడు పొద్దెరగడు అన్నట్లు కొంత మంది వచ్చి ఏదో చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బస్సుయాత్రలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జనంలోకి వచ్చాక జన సునామీ కనపడుతోందన్నారు. దీన్ని చూసి టీడీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుందన్నారు. అనంతపురం గతంలో కాంగ్రెస్, ఇప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఏ స్థాయిలో అభివృద్ధి, సంక్షేమం జరిగిందో ప్రజలందరికీ తెలుసన్నారు. తాము ఇచ్చిన హామీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఉందని, ఆ ఒక్కదాన్ని పట్టుకుని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటప్రసాద్ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఐదేళ్లలో నగరంలో జరిగిన అభివృద్ధి ఆయనకు కన్పించలేదా అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన బస్సుయాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు వస్తుంటే.. ఎల్లో మీడియా ఈనాడు, ఆంధ్రజ్యోతి అసత్య కథనాలు ప్రచురిస్తోందన్నారు. విష ప్రచారాన్ని చూసి టీడీపీ నాయకులు మురిసిపోతున్నారన్నారు. టికెట్ కోసం అందరూ ప్రయత్నిస్తామని.. కానీ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. అవ్వాతాతలకు పింఛన్లు అందకుండా వలంటీర్లపై ఆంక్షలు పెట్టేలా చేసిన ఘనత చంద్రబాబుదేనని మండిపడ్డారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎస్పీ జి.వీరరాఘవ రెడ్డి

అనంతపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నిత్యం అప్రమత్తంగా ఉండాలని అనంతపురం డీఎస్పీ జి.వీరరాఘవ రెడ్డి అన్నారు. శనివారం డివిజన్ పోలీసు కార్యాలయంలో డివిజన్ల వారీగా కేటాయించిన పోలీసు సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. కేటాయించిన డివిజన్లలో నిత్యం నిఘా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి ఆయా సీఐల దృష్టికి తీసుకరావాలన్నారు. సమస్యలు, గొడవలు తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి తెలియజేయాలన్నారు. డీఎస్పీతో పాటు సీఐలు రెడ్డప్ప, క్రాంతి కుమార్, ధరణికిశోర్, ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

విస్తృత తనిఖీలు

అనంతపురం: ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలతో అనంతపురం డీఎస్పీ జి. వీరరాఘవ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. డీఎస్పీతో పాటు అనంతపురం నాలుగో పట్టణ సీఐ ప్రతాప్ రెడ్డి, పోలీసు సిబ్బంది కలిసి స్థానిక చంద్రబాబు కొట్టాల, రాంనగర్, నాయక్ నగర్‌లో పర్యటించారు. ఆయా కాలనీల్లోని రహదారుల గుండా ఇతర ప్రాంతాలు, కాలనీల్లోకి వెళ్లి వచ్చే ప్రతి వాహనాన్ని పరిశీలించారు. కర్ణాటక లిక్కర్, డబ్బు, అక్రమంగా తరలించకుండా కట్టుదిట్టమైన నిఘా కొనసాగిస్తున్నారు.

అనంతపురం: ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యమని అనంతపురం వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప అన్నారు. నగరంలోని నీరుగంటి వీధి, సున్నపు గేరు, బోయ గేరు వేణుగోపాల్ నగర్‌లో పోలీసులు కవాతు నిర్వహించారు. స్థానికంగా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని కోరారు.

అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే చర్యలు

రాప్తాడు: అనంతపురం రూరల్ డివిజన్ పరిధిలో ఎవరైనా అక్రమంగా మద్యం, నగదు తరలిస్తే చర్యలు తప్పవని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి పేర్కొన్నారు. శనివారం రాప్తాడులోని 44వ జాతీయ రహదారిపై వైఎస్సార్ సర్కిల్, మండలంలోని కందుకూరు క్రాస్ రోడ్డులో రాప్తాడు పోలీసులు, స్పెషల్ పార్టీ పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టడానికి తరలించే ఎలాంటి వస్తువులనైనా సీజ్ చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని వెల్లడించారు. సెక్షన్ 30 పోలీస్ యాక్ట్, 144 సెక్షన్లను ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భాష్యం పాఠశాలను సీజ్ చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని మూడో రోడ్డులో అనుమతులు లేకుండా ప్రారంభించి 2024–25 అడ్మిషన్లు నిర్వహిస్తున్న భాష్యం స్కూల్‌ను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పాఠశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తుండగా ఎస్ఎఫ్ఐ నాయకులు డీఈఓకు సమాచారం అందించారు. డీఈఓ ఆదేశాలతో ఎంఈఓ వెంకటస్వామి పాఠశాల వద్దకు చేరుకుని రికార్డులు పరిశీలించారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్లెక్సీలు తొలగించి అడ్మిషన్ పత్రాలు స్వాధీనం చేసుకుని, ఆఫీస్‌కు తాళం వేయించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ మాట్లాడుతూ.. జిల్లాలో కార్పొరేట్ విద్య మాఫియా రోజురోజుకు పెరిగిపోతోందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విచ్చలవిడిగా నూతన పాఠశాల పేర్లతో పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసుకుంటూ కరపత్రాలు ద్వారా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు నిద్ర మత్తులో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలల్లో జరుగుతున్న దోపిడీ నుంచి తల్లిదండ్రులను రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, పట్టణ అధ్యక్షుడు భీమేష్, నాయకులు సోము, చంద్ర, వీరు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మేఘ స్వరూప్, చైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ (ఐఎన్‌టీఎస్ఓ) రెండో లెవెల్ పోటీల్లో శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. శనివారం మునిసిపల్ కమిషనర్ మేఘస్వరూప్ చేతుల మీదుగా చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. అనంతపురం 3వ బ్రాంచ్‌కు చెందిన బి.నవదీప్, 1వ బ్రాంచ్ టీ. చరిత, సీబీఎస్ఈ బ్రాంచ్ పూర్వజ్ రామ్, కళ్యాణదుర్గం బ్రాంచ్ మనస్విని గ్రాండ్ ప్రైజ్‌ల కింద ల్యాప్‌టాప్‌లు గెలుచుకున్నారని తెలిపారు. మొదటి ప్రైజ్ కింద 13 మంది విద్యార్థులు ట్యాబ్‌లు గెలుచుకున్నారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. విద్యార్థులు నచ్చిన రంగాల్లో ప్రతిభాపాటవాలు ప్రదర్శించి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ విశ్వనాథ్, సమీనా ఖాన్, తబుసుమ్, ఖలందర్, శాంత, ఫిలిప్, కోఆర్డినేటర్లు రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాస్, నాగభూషణం, డీన్లు శ్రీనివాసరెడ్డి, సిరాజ్, గంగాధర్, సత్యనారాయణ, చిరంజీవి, తిప్పారెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 50వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ బీసీ నాయకుడు అనిల్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శనివారం పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంజాన్ పండుగను పురస్కరించుకుని మహిళలకు చీరలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రిలాక్స్ నాగరాజు, కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయ ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్ గౌడ్, స్థానిక నాయకులు మహేష్, ఆసిఫ్, ఇద్రీస్, కార్తీక్, విశ్వ, చెర్రీ, వసీం, అబ్దుల్లా, రాఘవేంద్ర, వలి, జాన్, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి ఓటెయ్యాలి



వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని మేయర్ వసీం కోరారు. శనివారం స్థానిక 5వ రోడ్డులోని మహమ్మదియా మసీదు ప్రాంతంలో ఎన్నికల ప్రచారం చేపట్టారు. మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. గతంతో పోలిస్తే మైనార్టీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందారన్నారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో డిప్యూటీ సీఎం, శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్సీ, మేయర్ వంటి అనేక పదవులను, నామినేటెడ్ పోస్టులను ముస్లింలకు ఇచ్చిన ఘనత కేవలం వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. మైనార్టీలకు కో–ఆప్షన్ సభ్యులుగా అవకాశం కల్పించారన్నారు. ఎమ్మెల్యేగా అనంత వెంకటరామిరెడ్డి గెలిపిస్తే మైనార్టీలు మరింత అభివృద్ధి చెందుతారన్న విశ్వాసం వ్యక్తం చేశారు. పొత్తులతో వస్తున్న కూటమిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇషాక్, కొర్రపాడు హుస్సేన్‌పీరా, దాదా ఖలందర్, జావీద్, నదీమ్, షేక్షావలి తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కోవిడ్‌తోనే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఆలస్యం

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఆలస్యంపై టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని మేయర్ వసీం పేర్కొన్నారు. శనివారం 25వ డివిజన్‌లో మేయర్ విలేకరులతో మాట్లాడారు. ప్రసాద్ అనంతపురంపై అవగాహన పెంచుకోవాలన్నారు. కోవిడ్ కారణంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఆలస్యమైందన్నారు. ఇప్పటికే తాము డీపీఆర్ సిద్ధం చేసి కేంద్రానికి పంపడం జరిగిందన్నారు. అనంతపురంలో ఇటీవల మోటార్లు కాలిపోవడంతో నీటి సమస్య ఏర్పడిందన్నారు. రూ.2 కోట్లతో కొత్త మోటర్ కొనుగోలుకు టెండర్లను ఆహ్వానించడం జరిగిందన్నారు. అదేవిధంగా రూ.50 లక్షలతో మరో స్టాండ్‌బై మోటర్‌ను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో నీటి సరఫరాకు ఎటువంటి అంతరాయం కల్గకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

అభివృద్ధి కన్పించలేదా?

గత టీడీపీ ప్రభుత్వంలో వేరు కుంపట్లతో అభివృద్ధి డివైడర్లకే పరిమితం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కోవిడ్‌తో రెండేళ్లు గడిచిపోయినా ప్రజలకందే సంక్షేమం, నగరాభివృద్ధిలో ఎక్కడా జాప్యం జరగలేదన్నారు. అర్హులైన లబ్ధిదారులకు రూ.2,300 కోట్లకుపైగా సంక్షేమాన్ని అందించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. నగరంలో రూ.800 కోట్లకుపైగా అభివృద్ధి జరిగిందన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఎప్పుడు అండగా ఉంటారన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు



కళాశాల వార్షికోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, కళాశాల యజమాన్యం

రాప్తాడు: యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని ఎస్‌వీఐటీ కళాశాల కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ అన్నారు. మండలంలోని హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం క్రాష్ 2కే 24 కళాశాల 15వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ఎండీ రమాకాంత్ రెడ్డి, చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కరస్పాండెంట్ వీ.బీ.ఆర్.శర్మ మాట్లాడుతూ.. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, భావవ్యక్తీకరణపై దృష్టి సారించాలన్నారు. కళాశాల ఎండీ రమాకంత్ రెడ్డి మాట్లాడుతూ.. భవిష్యత్తులో దేశానికి యువ ఇంజనీర్ల అవసరం దేశానికి ఎక్కువగా ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉద్యోగాల కోసం కాకుండా ఉద్యోగాలిచ్చేస్థాయికి ఎదగాలని చెప్పారు. ఏ రంగంలోనైనా నైపుణ్యం గలవారికి ఉద్యోగ అవకాశాలు పుష్కలంగా లభిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన నృత్యాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, సీఈఓ ఆనంద్ కుమార్, ఏఓ శివా రెడ్డి పాల్గొన్నారు.

రంజాన్ సంతోషంగా జరుపుకోండి



ముస్లింలకు రంజాన్ తోఫా అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఆత్మకూరు: ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆకాంక్షించారు. శనివారం మండల కేంద్రంలోని ఓ మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ముస్లింలకు సతామి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఉపవాసదీక్షాపరులతో కలిసి ప్రార్థనలు చేశారు. మసీదు ఆవరణలో ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో భాగంగా భోజనం వడ్డించారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కష్టాలు, ఇబ్బందులు లేకుండా ప్రతి ఇంటా సిరి సంపదలు ఇవ్వాలని అల్లాను ప్రార్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

అనంతపురం అర్బన్: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు శనివారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు గుంతకల్లు ఆర్‌ఓ వి.శ్రీనివాసులురెడ్డి, రాయదుర్గం ఆర్‌ఓ కరుణకుమారి, తాడిపత్రి ఆర్‌ఓ రాంభూపాల్ రెడ్డి పూలమొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విమర్శలకు తావ్వికుండా ఎన్నికల విధులు జాగ్రత్తగా నిర్వర్తించాలని ఆర్‌ఓలకు సూచించారు.

సీఎం జగన్‌కు అండగా నిలవాలి



చర్చి పాస్టర్లను కలిసి ఓటు అభ్యర్థిస్తున్న వైపీ బాబు

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీ క్రైస్తవులకు అండగా నిలిచి అభివృద్ధిని కాంక్షించిందని పార్టీ క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపీ బాబు అన్నారు. శనివారం వైపీ బాబు ఆధ్వర్యంలో పలువురు క్రైస్తవ నాయకులు వివిధ ప్రార్థనా మందిరాల సంఘం కాపరులను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ బెనహర్ బాబు, అగాపె చర్చి పాస్టర్ రఘునాథ డేనియల్, ఎస్ఐయూ చర్చి రెవరెండ్ సంపత్‌కుమార్ తదితరులను కలిసి వైఎస్సార్‌సీపీ చేస్తున్న అభివృద్ధి పనులను వివరించారు. 2024లో మరోసారి ఎందుకు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలో వివరించారు. టీడీపీ చేస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దన్నారు. బీజేపీ విధానాలను గతంలో ఎండగట్టిన చంద్రబాబు అదే పార్టీతో కలిసి మరోసారి మైనార్టీలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే బిషప్ వై.అనిల్‌కాంత్, పాస్టర్ అబ్రహం, సాల్మన్‌రాజు, జాకోబ్ తదితర సంఘం పెద్దలను వైఎస్సార్‌సీపీ క్రైస్తవ విభాగం సభ్యులు కలిశారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు అనంత వెంకటరామిరెడ్డి, శంకరనారాయణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా ఏపీ స్టేట్ చాప్టర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా శనివారం ఐఎంఏ హాల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సర్జన్స్ ఆఫ్ ఇండియా ఏపీ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ ఫణిమహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 52 మంది రక్తదానం చేశారన్నారు. ఈ ఏడాది ఆరోగ్య దినోత్సవాన్ని మన ఆరోగ్యం–మన హక్కు నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మనోరంజన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ అభిషేక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైరల్



జీవితం అనే గురువు పాఠాలు, గుణపాఠాలు నేర్పుతుంది

సంజయ్ లీలా భన్సాలి 'హీరామండి– ది డైమండ్ బజార్' వచ్చే నెల నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. 'హీరామండి'లో మనిషా కోయిరాల నటించింది. 'హీరామండి' విడుదలకు ముందు ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్‌లో తన జీవితంలోని ప్రధాన సంఘటనల గురించి సుదీర్ఘమైన నోట్ రాసింది మనిషా. క్యాన్సర్‌తో తాను పోరాడిన రోజులను గుర్తు తెచ్చుకుంది.

'ఎన్నో మంచి పాత్రలలో నటించాను. ఎంతో మంది ఉత్తమ దర్శకులతో కలిసి పనిచేశాను. ఎంతోమంది స్నేహాన్ని పొందాను. దేవుడి దయతో క్యాన్సర్‌తో పోరాడి గెలిచాను. జీవితంలో ఎత్తుపల్లాలు ఉంటాయి. నా జీవితంలో ఎన్నో లోతులను చూశాను. జీవితాన్ని మించిన గురువు లేదు. ఎన్నో పాఠాలు, గుణపాఠాలు నేర్పుతుంది. కాలం విలువను తెలుసుకున్నాను' అంటూ రాసింది. మనిషా కోయిరాల రాసిన ఈ నోట్ నెట్‌జనులను బాగా కదిలించింది.

స్కేట్‌బోర్డ్‌పై మనాలి టు కన్యాకుమారి

'మనాలి నుంచి కన్యాకుమారికి ఎలా వెళతాం?' అనే ప్రశ్నకు 'స్కేట్‌బోర్డ్ మీద' అని ఎవరూ చెప్పరు. 'మీరు చెప్పక పోతేనేం... నేనైతే స్కేట్‌బోర్డ్ మీదే వెళ్లాను' అంటున్నాడు రితిక్. ప్రొఫెషనల్ స్కేట్ బోర్డర్ అయిన రితిక్ క్రాడ్జెల్ మనాలి నుంచి కన్యాకుమారికి స్కేట్‌బోర్డ్ మీద వెళ్లాడు.



ఈ ప్రయాణానికి సంబంధించిన వీడియోలు నెట్‌లోకాన్ని అబ్బురపరుస్తున్నాయి.

చిన్న బ్యాక్‌ప్యాక్‌తో బయలుదేరిన రితిక్ 100 రోజుల్లో తన ప్రయాణాన్ని పూర్తి చేశాడు. రీల్స్, వీడియోలలో తనకు ఎదురైన అనుభవాలను నెటిజనులతో పంచుకున్నాడు. గూగుల్ మ్యాప్స్ పనిచేయకపోవడం నుంచి దట్టమైన పొగమంచుతో హైవేల జీరో విజిబిలిటీ వరకు రితిక్‌కు ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి.

ఎన్ని సవాళ్లు ఎదురైనా ముందుకే వెళ్లాడు. రితిక్ సాహసం, ఓపికకు నెటిజనులు ప్రశంసల వర్షం కురిపించారు.

మా నాయినే! కొబ్బరికాయను తలకేసి కొట్టుకున్నాడు




కొబ్బరికాయను రాయిపై కొడితే పగులుతుంది. నుదుటిపై కొడితే? వైరల్ అవుతుంది! విషయంలోకి వస్తే... తమిళనాడుకు చెందిన ఒక వ్యక్తి కొబ్బరికాయ పట్టుకొని పూజాపీఠం దగ్గర శ్లోకాన్ని జపించాడు. ఆ తరువాత తల పైకి లేపి కొబ్బరికాయను నుదుటి మీద కొట్టుకున్నాడు. 'యాక్షన్‌కు రియాక్షన్' అనేది ప్రకృతి ధర్మం కదా! సదరు వ్యక్తి వెంటనే కుప్పకూలిపోయాడు. ఈ వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా వ్యక్తి చర్యను నెటిజనులు ఖండించారు. 'ఆపరేషన్ సక్సెస్ బట్ పేషెంట్ డెడ్', 'గాయపడింది నువ్వు కాదు... కొబ్బరికాయ'లాంటి సరదా కామెంట్స్ ఎన్నో కనిపించాయి.

మన తెలుగువాడి బయోపిక్

చూపు లేకపోయినా అంట్రప్రెన్యూర్‌గా విజయం సాధించిన మన తెలుగువాడు శ్రీకాంత్ బొల్లా బయోపిక్ ఫస్ట్‌లుక్ వైరల్ అయ్యింది.
రాజ్ కుమార్ రావు శ్రీకాంత్ పాత్ర పోషిస్తున్నాడు.



శ్రీకాంత్ బొల్లా



శ్రీకాంత్ బొల్లా పాత్రలో రాజ్ కుమార్ రావు

పుట్టుకతో అంధత్వం వెంటాడినా విజయాలు అందుకోవడానికి అది అడ్డుకాదని నిరూపించిన తెలుగు పారిశ్రామికవేత్త శ్రీకాంత్ బొల్లా బయోపిక్ 'శ్రీకాంత్' ఫస్ట్‌లుక్ విడుదలైంది. మంచి నటుడిగా పేరు గడించిన రాజ్‌కుమార్ రావు శ్రీకాంత్ పాత్రను పోషిస్తుండటం విశేషం. మచిలీపట్నంలో జన్మించిన శ్రీకాంత్ బొల్లా ఇంజినీరింగ్ చదువు విషయంలో చాలా సవాళ్లు ఎదుర్కొన్నాడు. అంధుడైన కారణాన ఐఐటీలో సీటు పొందలేకపోయాడు. అయితే పట్టుదలతో మసాచూసెట్స్ యూనివర్సిటీలో తొలి అంతర్జాతీయ అంధ విద్యార్థిగా దఖలయ్యి చదువుకున్నాడు. భారత్‌కు తిరిగి వచ్చి పారిశ్రామిక రంగంలో కీర్తి గడించాడు. బొల్లా జీవితం ఇప్పటికే ఎందరికో ఆదర్శం అయ్యింది. వెండితెర మీద ఆయన జీవితం చూసి మరెందరో స్ఫూర్తి పొందుతారు. తుషార్ హీరానందాని ఈ సినిమా దర్శకుడు.

ది గ్రేట్ వడా పావ్ వార్



దిల్లీ 'వైరల్ వడా పావ్ గర్ల్'గా పాపులర్ అయిన చంద్రికా గెరా దీక్షిత్ తాజాగా తన ఫుడ్ కార్ట్ సార్టప్‌తో రాత్రికి రాత్రి సెన్సేషన్‌గా మారింది. దీక్షిత్ పాపులారిటీ మాట ఎలా ఉన్నా ఆమెకు పోటీదారులు పెరిగారు. దీక్షిత్ ఫుడ్ కార్ట్ చుట్టుపక్కల పోటీదారులు వడా పావ్ బండ్లను ఏర్పాటు చేస్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. 'పాపులారిటీనే కొంపముంచిందా!' లాంటి హెడ్‌లైన్స్ నెటిజనుల నుంచి లైన్ కట్టాయి.

'నిన్న నేను రానందున తన బండిని ఉంచానని ఆంటీ చెప్పింది. ఈరోజు కూడా ఇక్కడే పెట్టింది. ఒకరి వ్యాపారాన్ని దెబ్బతీయాలనుకోవడం సమంజసమా!' అని తన ఆవేదనను వెళ్లగక్కింది దీక్షిత్.

ఫుడ్ వ్లాగర్ ఫూడీ మానేహా ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసింది.

ఈ వీడియో వైరల్ కావడంతో పోటీదారు ఆంటీ 'ఒకరి వ్యాపారాన్ని దెబ్బ తీసే ఉద్దేశం నాకు లేదు. నా పని నేను చేసుకుపోతున్నాను' అని ఎర్రటి ఎండల్లో కూల్‌గా బదులిచ్చింది. 'బండి ఎవరు పెట్టారనేది కాదు... రుచి ముఖ్యం' అని కూడా సెలవిచ్చింది.

చిప్స్ ఉండగా పూల చింత ఏల!

'పెళ్లి ఊరేగింపు కారును దేనితో అలంకరిస్తారు?' అనే ప్రశ్నకు టక్కున వినిపించే జవాబు... పువ్వులు.

పూల కొరతో, ఖర్చు అనుకున్నారో.. వైవిధ్యం కోసమో ఏమో తెలియదుగానీ ఈ పెళ్లి కారును పొటాటో చిప్స్ ప్యాకెట్స్‌తో అలంకరించారు. సత్పాల్ యాదవ్ అనే ఇన్‌స్టాగ్రామ్ యూజర్ పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. చిప్స్‌తో ముస్తాబైన ఈ పెళ్లి కారు గురించి నెటిజనులు సరదాగా స్పందించారు.

'పొటాటో చిప్స్ బ్రాండ్‌ను ప్రమోట్ చేసే పబ్లిసిటీ ఇది'

'చిప్స్ అంటే ఎంత ఇష్టముంటే మాత్రం ఇలానా!'

'చిప్స్‌కు బదులుగా ఫైవ్‌స్టార్ చాక్లెట్స్‌తో ముస్తాబు చేసి ఉంటే కారు వెంట జనాలు పరుగులు తీసేవారు'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో కనిపించాయి.



నగదు మాత్రమే ఇవ్వండి



జేబులో డబ్బులు పెట్టుకోవడం జనం మానేశారు. ఖర్మగాలి ఫోన్ పే పని చేయకపోతే తెల్లముఖాలు వేస్తున్నారు. నగదు లావాదేవీల వల్ల ఎంత ఖర్చవుతున్నదో ఎంత మిగిలి ఉన్నదో తెలిసేది. కాని ఆన్‌లైన్ పేమెంట్లకు హద్దు లేదు. ఈ నేపథ్యంలో చెన్నైలో ఆటో నడిపే ఒక పెద్దాయన తన ఆటోలో పెట్టిన నోటీస్ ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది.
నగదు అవసరాన్ని గుర్తు చేసే పోస్ట్ ఇది.

'జీ పే చేయొద్దు. డబ్బు డ్రా చేయడానికి ఏటీఎం దగ్గర ఆపమని అడగొద్దు' అని చెన్నైలో ఒక ఆటోబాబాయ్ పెట్టిన బోర్డు ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది. గతంలో అందరి దగ్గర డబ్బులుండేవి. ఆటో ఎక్కినా దిగినా డబ్బు ఇచ్చి బేరం ముగించేవారు. ఇప్పుడు అందరూ జీపే, ఫోన్‌పే చేస్తున్నారు. అయితే కొన్ని దుకాణాల్లో ఇప్పటికీ 'నగదు మాత్రమే' అనే బోర్డులు ఉన్నాయి. దానికి కారణం డిజిటల్ లావాదేవీల్లో ఏదైనా మోసం జరుగుతుందేమోనని. ఈ ఆటోబాబాయ్‌కి కూడా అలాంటి అనుభవాలు ఎదురై ఉండొచ్చు. లేదా ఎక్కిన వారు జీపే పని చేయకపోతే ఏటీఎం దగ్గరకు వెళదామని టైమ్ వేస్ట్ చేస్తూ ఉండొచ్చు. అందుకనే స్పష్టంగా 'ఏటీఎం దగ్గర ఆటో ఆపమని అడగొద్దు' అంటూ బోర్డ్ పెట్టాడు. చెన్నైలో ఇతని ఆటో ఎక్కిన మహిళ ఈ బోర్డును ఫొటో తీసి 'ఎక్స్'లో పెడితే ఇంటర్‌నెట్‌లో మంచి డిబేట్ నడిచింది. 'ఇలాగైతే ఎలా' అని కొందరంటే 'బ్యాంకు ట్రాన్సాక్షన్స్ అన్నీ డిజిటల్ పేమెంట్ల వల్ల ప్రభుత్వానికి ఎందుకు తెలియాలి?' అని కొందరు ప్రశ్నించారు. చివరకు ఆటో ఎక్కిన మహిళ తన అపార్ట్‌మెంట్ దగ్గర దిగి, సెక్యూరిటీ దగ్గర అప్పు తీసుకుని ఆటో బాబాయ్‌కి చెల్లించి బతుకు జీవుడా అనుకుంది.

హెల్త్

నేడు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ఏయే వయసుల్లో ఏయే వ్యాక్సిన్‌లు! ఏయే వైద్య పరీక్షలు..?





ఆరోగ్య సమస్య ఏమైనా వస్తే చికిత్స తప్ప ప్రత్యామ్నాయం లేదు. కానీ సమస్య రాకుండా ముందే నివారించుకుంటే ఆరోగ్యానికి ఢోకా ఉండదు. చికిత్స కంటే నివారణే మేలు అనే సూక్తి మేరకు వ్యాధుల నివారణకు ఉపయోగపడే అంశాల్లో మొట్టమొదటి అంశం టీకాలు (వ్యాక్సిన్లు). రెండో అంశం... లక్షణాలు కనిపించగానే చేయించాల్సిన వైద్యపరీక్షలు. నేడు 'వరల్డ్ హెల్త్ డే'. ఈ సందర్భంగా ఏ వయసులో వారు ఏయే వ్యాక్సిన్లు తీసుకోవాలన్న అంశంపై అవగాహన కోసం ఈ కథనం.

టీకాలు

చిన్నారి పుట్టిన వెంటనే... ఓపీవీ, బీసీజీలతో పాటు హెపటైటిస్ బి వ్యాక్సిన్ ఇస్తారు. ఆ తర్వాత 6, 10, 14 వారాల్లో ఇస్తారు).

ఆరు వారాలప్పుడు : ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా ఫస్ట్ డోస్ ● హెచ్‌ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా ఫస్ట్ డోస్ ● ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వైరస్)/ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా ఫస్ట్ డోస్ ● పీసీవీ 13 (న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా) ఫస్ట్ డోస్ ● రొటావైరస్ టీకా మొదటి డోస్ (ఇది నోటిద్వారా ఇస్తారు) ● హెపటైటిస్–బి వ్యాక్సిన్ రెండో డోస్.

పది వారాలప్పుడు: ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా రెండో మోతాదు ● హెచ్‌ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా రెండో మోతాదు ● ఐపీవీ / ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా రెండోడోస్ ● పీసీవీ 13 రెండో మోతాదు ● నోటిద్వారా ఇచ్చే రొటావైరస్ టీకా రెండో డోస్ ● హెపటైటిస్–బి మూడో డోస్.

పద్నాలుగు వారాలప్పుడు: ● డీ–ట్యాప్ (డిఫ్తీరియా, టెటనస్, పెర్టుసిస్) / డీపీటీ టీకా మూడో మోతాదు ● హెచ్‌ఐబీ (హిబ్) (హీమోఫీలస్ ఇన్‌ఫ్లుయెంజా టైప్ బి) టీకా మూడోమోతాదు ● ఐపీవీ (ఇనాక్టివేటెడ్ పోలియో వైరస్)/ ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) టీకా మూడో మోతాదు ● పీసీవీ 13 (న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా) మూడో మోతాదు ● రొటావైరస్ టీకా మూడో డోస్ (ఇది నోటిద్వారా ఇచ్చే డోస్) ● హెపటైటిస్–బి వ్యాక్సిన్ నాలుగో మోతాదు.

ఆరు నెలల వయసప్పుడు : ● ఇన్‌ఫ్లుయెంజా టీకా మొదటి మోతాదు ● ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) మొదటి మోతాదు

ఏడు నెలల వయసప్పుడు : ● ఇన్‌ఫ్లుయెంజా టీకా రెండో మోతాదు

తొమ్మిది నెలల వయసప్పుడు : ● ఓపీవీ (ఓరల్ పోలియో వ్యాక్సిన్) రెండో మోతాదు ● ఎమ్ఎమ్ఆర్ (తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకా ఫస్ట్ డోస్ ● టైఫాయిడ్ కాంజుగేట్ వ్యాక్సిన్ ఇస్తారు.

పన్నెండు నుంచి 15 నెలల వయసప్పుడు: ● ఎమ్ఎమ్ఆర్ (తట్టు, గవదబిళ్లలు, రుబెల్లా) టీకా రెండో మోతాదు ● వారిసెల్లా (చికెన్‌పాక్స్) టీకా మొదటి మోతాదు ● హెపటైటిస్–ఏ టీకా మొదటి మోతాదు (దీని రెండో డోస్ సాధారణంగా 18 నెలలప్పుడు ఇస్తారు) ● పీసీవీ (ప్యాక్‌డ్ సెల్ వాల్యూమ్) బూస్టర్.

పద్దెనిమిది నెలల వయసప్పుడు : ● డీట్యాప్ టీకా మొదటి బూస్టర్ డోస్ ● హెచ్ ఐబీ (హిబ్) టీకా మొదటి బూస్టర్ డోస్ ● ఐపీవీ లేదా ఓపీవీ టీకా ● హెపటైటిస్–ఏ రెండో డోస్.

మూడేళ్ల వయసప్పుడు: ● వారిసెల్లా వ్యాక్సిన్ రెండో డోస్ టీకా.

ఐదేళ్లప్పుడు: ● డీ–ట్యాప్ టీకా రెండో బూస్టర్ ● ఐపీవీ టీకా ● ఎమ్ఎమ్ఆర్ టీకా మూడో డోస్.

పది నుంచి పన్నెండేళ్ల వయసప్పుడు: ● హెచ్‌పీవీ టీకా మొదటి డోస్ (దీని రెండు, మూడు డోసులు 9 నుంచి 18 ఏళ్ల వయసప్పుడు) ● టీడ్యాప్ టీకా బూస్టర్ డోస్ ● మెనింగోకోకల్ కాంజుగేట్ టీకా మొదటి డోస్ (దీని బూస్టర్ 16 ఏళ్ల వయసప్పుడు ఇవ్వాల్సి ఉంటుంది).

పదిహేను నుంచి 16 ఏళ్ల వయసప్పుడు: ● మెనింగోకోకల్ కాంజుగేట్ టీకా బూస్టర్ డోస్ ● టీడీ / డీటీ టీకా.

18 నుంచి 65 ఏళ్ల వరకు: ఈ వయసులో ఎవరికైనా మంచి వ్యాధి నిరోధకత ఉంటుంది. గతం లో ఏదైనా వ్యాక్సిన్ తీసుకోకపోతే... డాక్టర్ సలహా మేరకు తీసుకోవచ్చు. వ్యాక్సిన్ తీసుకున్నదీ లేనిదీ గుర్తులేనప్పుడు డాక్టర్‌కు ఆ విషయం చెబితే... వారు కొన్ని పరీక్షల ద్వారా వ్యాక్సిన్ తీసుకున్నదీ లేనిదీ నిర్ధారించి అవసరమైతే ఇస్తారు.

65 ఏళ్లు పైబడిన వారికి: ఈ వయసు దాటాక కొన్ని వ్యాక్సిన్లు తప్పనిసరిగాను, మరికొన్ని అవసరాన్ని బట్టి తీసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు... ● పీసీవీ–13 అండ్ పీపీఎస్‌వీ 23 అనే వ్యాక్సిన్లను సాధారణంగా 65 ఏళ్లు దాటినవారికి ఇస్తుంటారు. ఇవి నిమోనియాను నివారించే నిమోకోకల్ వ్యాక్సీన్స్‌లు. ఇందులో తొలుత పీసీవీ–13 ఇస్తారు. ఆ తర్వాత రెండు నెలలకు పీపీఎస్‌వీ–23 ఇస్తారు ● టీ–డ్యాప్ వ్యాక్సిన్ : చిన్నప్పుడు తీసుకున్న టెటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ వ్యాధులను నివారించే వ్యాక్సిన్ తాలూకు బూస్టర్ డోసులను 65 ఏళ్లు పైబడ్డ తర్వాత ప్రతి పదేళ్లకోమారు తీసుకుంటూ ఉండాలి.



డాక్టర్ బీవీఎస్ అపూర్వ
కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్



ముందుగానే కొన్ని వైద్య పరీక్షలు చేయించడం వల్ల కొన్ని వ్యాధుల్ని కనుగొని సంపూర్ణంగా నయం చేసుకోవచ్చు. ఉదాహరణకు సర్వైకల్ క్యాన్సర్ అనే వ్యాధికి సుదీర్ఘమైన ముందస్తు వ్యవధి ఉంటుంది. అంటే అసలు వ్యాధి రావడానికి పదేళ్ల ముందునుంచే 'ప్రీ–సర్వైకల్ పీరియడ్' ఉంటుంది. పాప్ స్మియర్ అనే పరీక్ష ద్వారా వ్యాధి రాబోయే దశాబ్దకాలం ముందుగానే దాన్ని కనుగొనవచ్చు. క్యాన్సర్ ను ఎంత త్వరగా కనుగొంటే అంత తేలికగా నయమవుతుంది. ఆరోగ్యంగా ఉండటం కోసం ముందస్తుగా ఏయే వయసుల్లో ఏయే వైద్యపరీక్షలు ఉపకరిస్తాయో తెలుసుకుందాం.

పరీక్షలు

0 - 10 ఏళ్ల వయసులో: ఈ వయసులో అవసరం అయితే తప్ప పెద్దగా వైద్యపరీక్షలు అవసరం లేదు.

11 - 20 ఏళ్లు : ఇది యుక్త వయసులోకి మారే దశ. నిర్దిష్టంగా ఏవైనా వైద్యసమస్యలు ఉండటం లేదా లక్షణాలు కనిపించడం వంటి సమయాల్లో తప్ప... ఈ వయసులోనూ పెద్దగా వైద్యపరీక్షలు అవసరం పడవు.

20 - 30 ఏళ్లు : ఈ వయసులో కొన్ని లైంగిక సాంక్రమిక వ్యాధులు (ఎస్‌టీఐ'స్) కోసం మరీ ముఖ్యంగా హెపటైటిస్–బీ నిర్ధారణ పరీక్షలు చేయించి హెచ్‌బీఐజీ వ్యాక్సిన్ తీసుకోవాలి. అలాగే అమ్మాయిలైతే పాప్‌స్మియర్ వంటి గైనిక్ పరీక్షలు చేయించుకుని, 12 ఏళ్ల నుంచి 26 ఏళ్ల మధ్యకాలంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ప్రయోజనకరం.

30 నుంచి 40 ఏళ్లు : ఈ వయసు నుంచి డయాబెటిస్ కోసం హెచ్‌బీఏ1సీ అనే రక్తపరీక్షలు, రక్తపోటు పరీక్షలు చేయించుకోవాలి. ఏవైనా తేడాలుంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించి ఈసీజీ, టూ డీ ఎకో, అవసరాన్ని బట్టి ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలు చేయించాలి. అలాగే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలూ మంచిదే. మహిళలైతే డాక్టర్ సలహా మేరకు బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మామోగ్రామ్ పరీక్ష చేయించాలి.

40 - 50 ఏళ్లు : ఈ వయసు నుంచి దేహంలో కొన్ని మార్పులు మొదలవుతాయి. అందుకే ఈ వయసులో పరీక్షలు తరచూ చేయిస్తుండటం మేలు. రక్తపోటును తెలుసుకోవడం కోసం సిస్టోల్, డయాస్టోల్ ప్రెషర్స్, రక్తంలో చక్కెర మోతాదుల కోసం హెచ్‌బీఏ1సీతో పాటు అవసరమైతే గ్లూకోస్ టాలరెన్స్ టెస్ట్ (జీటీటీ), పొద్దున్నే పరగడుపున, ఏదైనా తిన్న తర్వాత చేసే ఫాస్టింగ్ బ్లడ్ షుగర్, పోస్ట్ ప్రాండియల్ వైద్య పరీక్షలతోపాటు అవసరాన్ని బట్టి కొన్నిరకాల క్యాన్సర్ పరీక్షలు చేయించడం మంచిది.

అలాగే మహిళలైతే ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ డెన్సిటీ పరీక్ష చేయించాలి. దాంతోపాటు మామోగ్రామ్, పాప్ స్మియర్ పరీక్షలను డాక్టర్ చెప్పిన వ్యవధుల్లో చేయించాలి.

ఇక పురుషులైతే ఈ వయసు నుంచి ప్రోస్టేట్ స్పెసిఫిక్ ఏంటీజెన్... సంక్షిప్తంగా పీఎస్ఏ అనే పరీక్షను డాక్టర్లు చెప్పిన వ్యవధుల్లో చేయించుకుంటూ ఉండాలి.

50 - 60 ఏళ్లు : చాలామంది 50 ఏళ్ల వరకు ఎలాంటి పరీక్షలు చేయించకపోవచ్చు. అయితే అలాంటివాళ్లంతా ఈ 50 – 60 ఏళ్ల మధ్యవయసులో తప్పక వైద్యపరీక్షలు చేయించాల్సిన అవసరం తప్పక వస్తుంది. ముందు నుంచి పరీక్షలు చేయించని వాళ్లతోపాటు ఈ వయసులోని అందరూ ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ స్కాన్, కోలన్ క్యాన్సర్ నిర్ధారణ కోసం కొలనోస్కోపీ, గుండె జబ్బుల కోసం తరచూ ఈసీజీ, టూ డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలతో పాటు లక్షణాలను బట్టి ఇతర వైద్యపరీక్షలు చేయిస్తుండాలి.

మహిళలకు 50 ఏళ్ల వయసు తర్వాత మెనోపాజ్ రావడంతో గుండెకు ఉండే ఒక సహజ రక్షణ తొలగిపోతుంది. అందువల్ల గతంలో చేయించినా, చేయించక పోయినా ఈ వయసు నుంచి మహిళలు గుండెకు సంబంధించిన అన్ని స్క్రీనింగ్ పరీక్షలు అంటే ఈసీజీ, టూడీ ఎకో, ట్రెడ్‌మిల్ వంటి పరీక్షలు చేయించాలి.

60 నుంచి 70 ఏళ్లు : ఈ వయసులో వాళ్లనే సీనియర్ సిటిజెన్‌గా పరిగణిస్తుంటారు. పురుషులూ మహిళలు అన్న తేడా లేకుండా... ఈ వయసు నుంచి అందరూ... ఆస్టియోపోరోసిస్ నిర్ధారణ కోసం బోన్ స్కాన్, కోలన్ క్యాన్సర్ నిర్ధారణ కోసం కొలనోస్కోపీ, గుండెజబ్బుల కోసం తరచూ ఈసీజీ, టూ డీ ఎకో, ట్రెడ్‌మిల్ పరీక్షలతోపాటు లక్షణాలను బట్టి మరికొన్ని ప్రత్యేకమైన పరీక్షలు అవసరమవుతాయి.

70+ పైబడ్డాక... ఆపైన కూడా...

ఈ వయసు నుంచి లక్షణాలను బట్టి ఓ వ్యక్తి సంపూర్ణంగా ఆరోగ్యంగా ఉండేందుకు పైన పేర్కొన్న వైద్యపరీక్షలతో పాటు కొన్ని వ్యాక్సిన్లు, మరికొన్ని మందులు తీసుకోవాలి. ఒకవేళ పోషకాహార లోపం ఉంటే, తగిన ఆహారం తీసుకోవాలి. దాంతోపాటు అవసరం అయితే మరికొన్ని హెల్త్ సప్లిమెంట్స్ వంటివి తీసుకోవాల్సి ఉంటుంది.



డాక్టర్ హరికిషన్
సీనియర్ కన్సల్టెంట్
జనరల్ ఫిజీషియన్